క్లుప్తంగా

వైఎస్‌ఆర్ సీపీ నేతకు పరామర్శ


అయ్యప్పరెడ్డిని పరామర్శిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా

వడమాలపేట(విజయపురం): వడమాలపేట మండలం అప్పలాయగుంటకు చెందిన వైఎస్ ఆర్ సీపీ సీనియర్ నాయకుడు అయ్యప్పరెడ్డిని మాజీ మంత్రి ఆర్కే రోజా శనివారం పరామర్శించారు. ఆయన ఆరోగ్య వివరాలను అడిగి తెలుసుకొన్నారు. ఆమె వెంట కన్వీనర్ సుబ్రమణ్యంరెడ్డి, మాజీ జెడ్పీటీసీ సురేష్‌రాజు, సర్పంచ్ శేషాద్రిరెడ్డి, నందయ్య, వేణు, కిరణ్, పవన్, ప్రతిమ, కమల, భరత్, చంద్ర, కృష్ణారెడ్డి, నిరంజన్‌రెడ్డి, బాల తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా ముగిసిన ఇంటర్ పరీక్షలు


కళాశాలలో పరీక్ష రాసి వస్తున్న విద్యార్థులు

పాలసముద్రం: మండల కేంద్రంలోని పాలసముద్రం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శనివారం ఇంటర్ పబ్లిక్ పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయని కళాశాల ప్రిన్సిపల్ హేమలత తెలిపారు. మొదటి సంవత్సరం 101, ద్వితీయ సంవత్సరం 92 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరయ్యారు. చీఫ్ సూపరింటెండెంట్ వినాయకం, డిపార్టుమెంట్ ఆఫీసర్ శివశంకర్ పోలీస్ సిబ్బంది ఆధ్వర్యంలో ప్రశాంతంగా పరీక్షలు ముగిశాయి.

లీడర్‌షిప్ స్కిల్స్ అవసరం


కోర్సు సర్టిఫికెట్లు అందిస్తున్న ప్రిన్సిపల్

నగరి: ప్రస్తుత పోటీ ప్రపంచంలో లీడర్ షిప్ అండ్ కొలాబరేషన్ స్కిల్స్ అవసరమని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ ఆర్.వేణుగోపాల్ అన్నారు. దీనిపై ఒక నెల సర్టిఫికెట్ కోర్సు ముగింపు వేడుకలను శనివారం నిర్వహించారు. ఆయన కోర్సు ఆవశ్యకతను విద్యార్థులకు తెలియజేశారు. ఇంగ్లీష్ విభాగాధిపతి రేవతి కోర్సు లాభాలను క్లుప్తంగా వివరించారు. విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేశారు. అధ్యాపకులు పంకజ, సిబ్బంది పాల్గొన్నారు.

వినియోగదారుల హక్కులపై అవగాహన


మాట్లాడుతున్న అధ్యాపకురాలు దేవకి

పుత్తూరు: ప్రతి ఒక్కరూ వినియోగదారుల హక్కులపై అవగాహన కలిగి ఉండాలని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల వాణిజ్య విభాగం అధ్యక్షురాలు డాక్టర్ దేవకి తెలిపారు. శనివారం కళాశాలలో ప్రపంచ వినియోగదారుల దినోత్సవాన్ని నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ వ్యాపారుల దోపిడీ నుంచి తమను తాము రక్షించుకోవడానికి హక్కులపై అవగాహన పెంచుకోవాలన్నారు. వినియోగదారుల క్లబ్ కన్వీనర్ డాక్టర్ వాసవి, అధ్యాపకులు తిరుమలయ్య, గంగయ్య, మురళీమోహన్‌రెడ్డి, జ్యోతి, లక్ష్మీబాయి, నాగరాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

వాహనదారులకు అవగాహన అవసరం


కొత్త మోటార్ వాహన చట్టాన్ని వివరిస్తున్న ఎస్ఐ చిన్నరెడ్డప్ప

పాలసముద్రం: రోడ్డు ప్రమాదాల్లో ద్విచక్ర వాహనదారుల రక్షణకు పోలీస్ శాఖ చర్యలు చేపట్టిందని ఎస్ఐ చిన్నరెడ్డప్ప తెలిపారు. శనివారం బలిజకండ్రిగలో నూతన మోటార్ వాహన చట్ట నిబంధనలపై ద్విచక్ర వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ మునస్వామి, రవి పాల్గొన్నారు.

సీఐ, ఎస్ఐ సేవలు భేష్


పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటుతున్న నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్

కార్వేటినగరం: సర్కిల్ పరిధిలో క్రైమ్ రేట్‌ను తగ్గించడంలో సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్‌ల సేవలు అభినందనీయమని నగరి డీఎస్పీ సయ్యద్ మహ్మద్ అజీజ్ అన్నారు. శనివారం కార్వేటినగరం పోలీస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో డీఎస్పీ మాట్లాడారు. సర్కిల్ పరిధిలో నేరాలను అదుపులోకి తీసుకురావడంలో సీఐ హనుమంతప్ప అహర్నిశలు కృషి చేస్తున్నారని, మండలంలో కూడా నేరాలు జరగకుండా ఎస్ఐ రాజ్‌కుమార్ ప్రత్యేక దృష్టి సారించారని తెలిపారు. శక్తి యాప్‌పై అందరికీ అవగాహన కల్పించాలని కోరారు. స్థానిక పోలీస్ స్టేషన్ ఆవరణలో మొక్కలను నాటి నీరు పోశారు. అనంతరం పోలీస్‌స్టేషన్ ఆవరణలో సీఐ హనుమంతప్ప, ఎస్ఐ రాజ్‌కుమార్ ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని డీఎస్పీ ప్రారంభించారు. ఏఎస్ఐ మునికృష్ణ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


పూత, పిందె రాలిపోవడంతో పుల్లలు మిగిలిన మామిడి చెట్టు


పూత రాని మామిడి చెట్టు

ఊరించిన పూత.. ఉసూరుమన్న పిందె

- ఉగాది సమీపిస్తున్నా కానరాని పిందెలు
- నిరాశలో మామిడి రైతులు

వడమాలపేట(విజయపురం): ఈ ఏడాది మామిడి పూత ఆలస్యంగా వచ్చింది. చెట్టు అంతా పూత విరబూసి ఊరించాయి. తీరా చూస్తే పూత రాలిపోయి పిందెలు పడకుండా పుల్లలు మిగిలి కాపు ఉసూరుమనిపించిందిం. దీంతో మామిడి రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో శివరాత్రికి శివలింగమంత పిందె, ఉగాదికి ఊరగాయకు పనికివచ్చే అంత కాయ ఉండేది. ప్రస్తుతం అందుకు విరుద్ధంగా శివరాత్రికి పూతలు, ఉగాదికి పిందెలు అన్న చందంగా పరిస్థితులు మారిపోయాయి. పూతలు ప్రారంభమైనప్పటి నుంచి పురుగు, తెగుళ్ల నివారణకు ఇప్పటికే నాలుగు నుంచి ఐదు దఫాలు మందులు పిచికారీ చేశారు. అయినా ఇప్పటికీ 25 శాతం కూడా పిందెలు నిలబడలేదు. గత మూడు సంవత్సరాలుగా కాపు బాగా ఉన్నప్పుడు ధరలు లేవు. కాపు లేనప్పుడు ధరలు ఉంటున్నాయి. దీనికి తోడు తెగుళ్ల అధికం కావడంతో నాణ్యత లేకపోవడం, పండు ఈగ ప్రభావం, రైతులను దోచుకోవడానికి అలవాటు పడిన దళారీ వ్యవస్థ ఏకమై రైతులను నిలువునా ముంచేస్తోంది. దీంతో పెట్టుబడి చేతికిరాక అప్పులు పాలై అడుక్కుతినే పరిస్థితి వచ్చిందని రైతులు వాపోతున్నారు.

వర్షం కురుణించినా...

గత ఏడాది వర్షాలు బాగా పడ్డాయి, కాలువలు, ఏర్లు కళకళలాడాయి. వాతావరణం బాగుంది. కాపు బాగా వచ్చి తమను గట్టెక్కి స్తాయని ఆశ పడిన మామిడి రైతులకు నిరాశే మిగిలింది. ఈ ఏడాది కొన్ని చెట్లకు పూత రాకుండా చిగురులు తొడిగాయి. మరికొన్ని చెట్లు పూత విరబూసినా పిందెలు అరకొరగా నిలిచాయి.

5వేల ఎకరాల్లో సాగు

వడమాలపేట మండలంలో సుమారు 5వేల ఎకరాల్లో మామిడి సాగవుతోంది. ఎస్‌బీఆర్‌పురం, తడుకు, ఏఎంపురం, బట్టికండ్రిగ, వసంతనగరం, సీతారామపురం, నత్తకండ్రిగ, బాలనాయుడుకండ్రిగ, బంగారెడ్డికండ్రిగ, యనమలపాలెం, తిరుమణ్యం, టీఆర్‌కండ్రిగ, వేమాపురం తదితర గ్రామాల్లోని రైతులు మామిడిపై ఆధారపడి జీవిస్తున్నారు. ప్రతి ఏడు రైతులు నష్టాల పాలవుతున్నారు. ప్రభుత్వం స్పందించి మామిడి సాగుకు రాయితీలు ఇచ్చి దళారీ వ్యవస్థను నివారించాలని, అలాగే గిట్టుబాటు ధర నిర్ణయించి తమకు న్యాయం చేయాలని మామిడి రైతులు కోరుతున్నారు.

ప్రతి ఏటా నష్టపోతున్నాం



ప్రతి ఏడు నష్టాల పాలవుతున్నాం. మందులు పిచికారీ చేసిన ఖర్చు కూడా రావడం లేదు. మామిడి సాగును నమ్ముకుంటే అప్పుల్లో మునిగిపోవడం ఖాయం. తోటలను నరికి వేయక తప్పని పరిస్థితి వచ్చింది. ప్రభుత్వం రాయితీ అందించి మామిడి రైతులను ఆదుకోవాలి.

– చంద్రశేఖర్‌రెడ్డి, పూడి

ప్రభుత్వం ఆదుకోవాలి



ప్రకృతి అనుకూలించకపోవడం, అంతుబట్టని తెగుళ్ల ఆశించడం, సక్రమంగా కాపు రాకపోవడం, దిగుబడి వచ్చినా గిట్టుబాటు ధరలు లేకపోవడంతో చాలా నష్టపోతున్నాం. ఈ ఏడాది పూర్తిగా ఎరువులు, మందులు పిచికారీ చేసినా దిగుబడి రావడం లేదు. ప్రభుత్వం స్పందించి, మామిడి రైతులను ఆదుకోవాలి.

– ఉమాపతి, బట్టికండ్రిగ

కాన్షీరామ్‌కు ఘన నివాళి


కాన్షీరామ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీఎస్పీ నేతలు

నగరి: బహుజన సమాజ్‌వాదీ పార్టీ వ్యవస్థాపకుడు కాన్షీరామ్ 91వ జయంతిని పురస్కరించుకొని స్థానిక బీఎస్పీ నేతలు ఆయనకు ఘననివాళులర్పించారు. శనివారం నగరి పట్టణంలో కాన్షీరామ్ చిత్రపటాన్ని ఏర్పాటుచేసి పూలదండలు వేసి పూజలు చేశారు. వెనుకబడిన తరగతుల వారి కోసం ఆయన చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.నాగూర్, నాయకులు లక్ష్మణ్, ధనుష్, వందన, షబీ పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

పెనుమూరు(కార్వేటినగరం): ప్రజలు అధికారుల దృష్టికి తీసుకొచ్చిన సమస్యలను సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ వీఎం థామస్ అన్నారు. శనివారం మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజావేదిక కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని, ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు ఇచ్చిన వినతులను త్వరగా పరిష్కరించి, వారికి న్యాయం చేస్తానని హామీ ఇచ్చారు. ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి, తహశీల్దార్ శ్రావణ్‌కుమార్, మాజీ ఎంపీపీ హరిబాబు, రుద్రప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ట్యాంకు నిర్మాణంపై విచారణ చేపట్టాలి

పుత్తూరు పట్టణంలోని ఎస్ఎస్ ట్యాంకు మరమ్మతు పనుల్లో అవినీతి జరిగిందంటూ శాసనసభలో నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్ ప్రస్తావించడాన్ని తాము స్వాగతిస్తున్నామని, ట్యాంకు నిర్మాణంపై కూడా పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి శనివారం జరిగిన మున్సిపల్ సమావేశంలో ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

- 4వ వార్డు టీడీపీ కౌన్సిలర్ కేశావాచారి ఎన్నిక చెల్లదంటూ కోర్టు తీర్పు
- 4వ వార్డును ఖాళీగా ప్రకటించాలంటూ టేబుల్ అజెండా తీర్మానం
- మార్కెట్ వేలం పాటలు, జీతభత్యాలు మినహా...
- ఇతర అన్ని అంశాలను తోసిపుచ్చిన కౌన్సిల్ సమావేశం
- వాడీవేడిగా ప్రసంగించిన మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి, టేబుల్ అజెండాను అందజేస్తున్న వైఎస్‌ఆర్ సీపీ విప్ వనిత

పుత్తూరు: పట్టణంలో రూ.55 కోట్లతో నిర్మించిన ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణ పనులపైనా పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని మున్సిపల్ చైర్మన్ ఆనంగి హరి కౌన్సిల్ సభ్యుల హర్షధ్వానాల మధ్య రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. నగరి శాసనసభ్యులు గాలి భానుప్రకాష్ ఎస్ఎస్ ట్యాంకు కట్ట కుంగిన నేపథ్యంలో రూ.45 లక్షలతో చేపట్టిన మరమ్మతు పనుల్లో అవినీతి జరిగిందంటూ శాసనసభలో ప్రస్తావించి, విచారణకు ఆదేశించడాన్ని స్వాగతిస్తున్నట్లు ప్రకటించారు. ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణంపై కూడా పూర్తి స్థాయి విచారణ చేపట్టాలని, ఆ దిశగా ఎమ్మెల్యే శాసనసభలో ప్రస్తావించాలని డిమాండ్ చేశారు. శనివారం చైర్మన్ ఆనంగి హరి అధ్యక్షతన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం వాడీవేడిగా జరిగింది. ఈ సందర్భంగా హరి మాట్లాడుతూ ఎస్ఎస్ ట్యాంకులోకి నీరు చేరిన తొలి ఏడాదే కట్ట కుంగిపోయి పుత్తూరు ప్రజల ప్రాణాలమీదికి వచ్చిందని గుర్తు చేశారు. ఆనాటి నగరి ఎమ్మెల్యే ఆర్కే రోజా జిల్లా కలెక్టర్, పబ్లిక్ అండ్ హెల్త్ అధికారులను అప్రమత్తం చేసి యుద్ధప్రాదిపతికన మరమ్మతులు చేసి ప్రజల ప్రాణాలను కాపాడినట్లు వెల్లడించారు. ఆనాటి మరమ్మతులపై విచారణ చేపట్టాలన్న ప్రస్తుత ఎమ్మెల్యే భానుప్రకాష్ నిర్మాణ పనులపై కూడా విచారణ చేపట్టాలని సవాల్ విసిరారు.

గుమ్మడికాయ దొంగ అంటే..

ఎస్ఎస్ ట్యాంకు నిర్మాణంపై విచారణ చేపట్టాలని చైర్మన్ హరి అనగానే ప్రతిపక్ష టీడీపీ ఫ్లోర్ లీడర్ గాలి జీవరత్నంనాయుడు ఎమ్మెల్యే పేరును ప్రస్తావించడం సరికాదంటూ ఆక్షేపించారు. దీనిపై హరి సమాధానం ఇస్తూ 'కౌన్సిలర్ గుమ్మడికాయల దొంగ అనగానే భుజాలు తడుముకోవడం ఎందుకూ.. నాసిరకంగా నిర్మాణ పనులు చేసిన కాంట్రాక్టర్‌ను ఉద్దేశించి చేసిన డిమాండ్‌కు ఎందుకు ఉలిక్కిపడుతున్నారు, ఆ పనులను ఎమ్మెల్యే ఏమైనా చేశారా' అంటూ ఎదురు ప్రశ్నించారు. దీంతో జీవరత్నంనాయుడు తన సీటుకు పరిమితమయ్యారు.

టేబుల్ అజెండాగా 4వ వార్డును ఖాళీగా ప్రకటించాలని ప్రతిపాదించారు. పుత్తూరు మున్సిపాలిటీ కౌన్సిల్ ఎన్నికల్లో 4వ వార్డు నుంచి తెలుగుదేశం పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన కేశావాచారి ఎన్నికను రద్దు చేస్తూ పుత్తూరు కోర్టు ఇచ్చిన తీర్పు నేపథ్యంలో ఆ వార్డును ఖాళీగా ప్రకటించాలని కోరారు. ఈ మేరకు వైఎస్‌ఆర్ సీపీ కౌన్సిలర్ వనిత విప్ జారీ చేశారు. విప్ లేఖను చైర్మన్, వైస్ చైర్మన్లకు అందజేశారు.

మూడు అంశాలకే ఆమోదం

పుత్తూరు కూరగాయల మార్కెట్, బస్టాండ్, జంతు వధశాల వేలం పాటలు, మున్సిపల్ సిబ్బంది జీతభత్యాలు, 4 వార్డు కౌన్సిల్ స్థానం ఖాళీ అన్న మూడు అంశాలను మాత్రమే ఆమోదిస్తున్నట్లు చైర్మన్ హరి ప్రకటించి సమావేశాన్ని ముగించారు. అంతకు ముందు కౌన్సిలర్లు బాలసుబ్రమణ్యం, హేమలత, కె.రాధ, బి.రాధ, విజయలక్ష్మి తమ వార్డుల్లో నెలకొన్న సమస్యలపై ఏకరువుపెట్టారు. సమావేశంలో మున్సిపల్ కమిషనర్ ఎం.మంజునాథగౌడ్, డీఈఈ చంద్రశేఖర్‌రెడ్డి, వైస్ చైర్మన్లు శంకర్, జయప్రకాష్, కౌన్సిలర్లు, కో-ఆప్షన్‌మెంబర్లు, అధికారులు పాల్గొన్నారు.



వధూవరులకు ఆశీస్సులు

పుత్తూరు: జీడీఆర్ కల్యాణమండపంలో శనివారం జరిగిన కౌన్సిలర్ భానుమతి, చక్రపాణి దంపతుల కుమారుడు ఉత్తమ్ వివాహ రిసెప్షన్‌లో మాజీ మంత్రి, వైఎస్‌ఆర్ సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఆర్కే రోజా, ఆమె సోదరుడు వై.కుమారస్వామిరెడ్డి పాల్గొన్నారు. నూతన వధూవరులను ఆశీర్వదించారు. వారి వెంట పలువురు వైఎస్‌ఆర్ సీపీ నాయకులు ఉన్నారు.

స్వచ్ఛ ఆంధ్రలో భాగస్వాములు కావాలి


పుత్తూరులో రోడ్లు ఊడుస్తున్న మున్సిపల్ అధికారులు

పుత్తూరు: ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని స్థానిక ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ జి.కోటేశ్వరయ్య పిలుపునిచ్చారు. మూడో శనివారాన్ని పురస్కరించుకొని కళాశాలలో స్వర్ణాంధ్ర- స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. పాలిటెక్నిక్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్ కోరారు. పట్టణంలోని పలు దుకాణాల్లో మున్సిపల్ కమిషనర్ మంజునాథగౌడ్ బృందం తనిఖీలు నిర్వహించారు. సింగిల్ యూస్ ప్లాస్టిక్‌ను స్వాధీనం చేసుకొని జరిమానా విధించారు. అధికారులు చీపురులు చేతపట్టి పట్టణంలోని రోడ్లను ఊడ్చారు. అనంతరం అంబేడ్కర్ సర్కిల్ వద్ద మానవహారంగా ఏర్పడి అవగాహన కల్పించారు.

స్వచ్ఛ ఆంధ్రపై ర్యాలీ

నిండ్ర: స్వచ్ఛ ఆంధ్రను స్వర్ణాంధ్రగా తయారు చేయాలని కోరుతూ శనివారం మండల కేంద్రంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ శివప్రసాద్ వర్మ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయం, పంచాయితీలలో ప్రతి మూడో శనివారం స్వచ్ఛత దినోత్సవంగా పరిసరాలను పరిశుభ్రం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల పంచాయతీ విస్తరణ అధికారి లక్ష్మీపతి, పంచాయతీ కార్యదర్శులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్లాస్టిక్ రహితంగా గ్రామాలు

కార్వేటినగరం: గ్రామాలను ప్లాస్టిక్ రహితంగా తీర్చిదిద్దడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ విజయులురెడ్డి అన్నారు. శనివారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల, వేణుగోపాలస్వామి ఆలయం, ఎంపీడీఓ కార్యాలయాల ఆవరణాల్లో స్వర్ణ ఆంధ్ర..


నిండ్రలో ర్యాలీలో అధికారులు, విద్యార్థులు

స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ఎంపీడీఓ చంద్రమౌళి, ప్రిన్సిపల్ విజయులురెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. ప్లాస్టిక్ నివారణపై పోస్టర్లు తయారు చేసిన విద్యార్థులు చక్రధర్, భానుప్రకాష్‌లను అభినందించారు. శ్రీ వేణుగోపాలస్వామి ఆలయ ఆరవణలో ఆలయ అధికారి సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని నిర్వహించారు. శ్రీసుబ్రమణ్యస్వామి ఆలయ ఆవరణంలో కూడా కార్యక్రమాన్ని నిర్వహించారు.

స్వచ్ఛ విద్యాలయ ర్యాలీ

నగరి: మండలంలోని ఎం.కొత్తూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు, విద్యార్థులు స్వచ్ఛ విద్యాలయ కార్యక్రమంలో భాగంగా గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శనివారం పాఠశాల ఆవరణను శుభ్రం చేసి ఎస్ఏఎస్ఏ యాప్‌లో పాఠశాలకు సంబంధించిన ఫొటోలను సబ్మిట్ చేశారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

పాలసముద్రం: స్వచ్ఛ ఆంధ్ర-స్వచ్ఛ దివస్‌లో భాగంగా పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలని మండల విస్తరణాధికారి రమేష్, ఐకేపీ ఏపీఎం కల్పలతరెడ్డి తెలిపారు. శనివారం పాలసముద్రం ఉన్నత పాఠశాల, ప్రభుత్వ కార్యాలయ ఆవరణలో పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం డ్వాక్రా సంఘాల సభ్యులతో ప్రతిజ్ఞ చేశారు.

విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలి


మాట్లాడుతున్న జడ్పీ సీఈఓ రవికుమార్‌నాయుడు


విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ

పెనుమూరు(కార్వేటినగరం): ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించడంతో భవిష్యత్తులో గుర్తింపు వస్తుందని జిల్లా పరిషత్ సీఈఓ రవికుమార్‌నాయుడు అన్నారు. శనివారం మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరిగిన వార్షికోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా ఆయన పాల్గొన్నారు. పాఠశాలలో ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. జడ్పీ సీఈఓ రవికుమార్ నాయుడిని ఎంపీడీఓ నీలకంఠేశ్వరరెడ్డి, పాఠశాల హెచ్‌ఎం యామిని, ఉపాధ్యాయులు శాలువాలు కప్పి, పూలమాలతో ఘనంగా సన్మానించారు.

పరీక్ష సామగ్రి పంపిణీ

విజయపురం: మండలంలోని శ్రీహరిపురం ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం విశ్రాంత ఉపాధ్యాయుడు చంద్రయ్య పరీక్షకు అవసరమైన సామగ్రి అందించారు. హెచ్‌ఎం జ్ఞానప్రకాష్ చేతుల మీదుగా 29 మంది విద్యార్థులకు ప్యాడ్స్, పెన్నులు, పెన్సిల్స్ అందజేశారు. విద్యార్థులు ఉన్నత శ్రేణిలో ఉత్తీర్ణులు కావాలని ప్రధానోపాధ్యాయుడు జ్ఞానప్రకాష్ పేర్కొన్నారు. దాత చంద్రయ్యను ఉపాధ్యాయులు సన్మానించారు. ఉపాధ్యాయులు విజయచంద్రిక, సునీత, రాధాకుమారి, గోపి, వెంకటేష్, వెంకమరాజు పాల్గొన్నారు.

జీడీనెల్లూరులో..

గంగాధరనెల్లూరు: ముక్కళత్తూరు జడ్పీ ఉన్నత పాఠశాలలో సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం పదో తరగతి చదువుతున్న విద్యార్థులకు పరీక్షా సామగ్రి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సేవ ఫౌండేషన్ ఆధ్వర్యంలో రిటైర్డ్ ప్రధానోపాధ్యాయుడు చంద్రశేఖర్‌రెడ్డి పరీక్షా సామగ్రి అందజేశారు. సేవా సంస్థ అధ్యక్షుడు డాక్టర్ రాజేష్, ప్రధానోపాధ్యాయిని భాగ్యలక్ష్మి, ఉపాధ్యాయులు చంద్రశేఖర్‌రెడ్డి, లోకనాథరెడ్డి, లక్ష్మీనాథం, నాగేశ్వరరావు, సునీల్ కుమార్, ఫైరోజ్ బాబు, విద్యార్థులు పాల్గొన్నారు.

రాజకీయ ఒత్తిళ్లు ఆపాలి


మాట్లాడుతున్న కోదండయ్య

నగరి: ప్రభుత్వ పాఠశాలలో పనిచేసే డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన కార్మికులపై రాజకీయ ఒత్తిళ్లు ఆపాలని, వేతనాలు పెంచి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కోదండయ్య, జిల్లా గౌరవ అధ్యక్షుడు నాగరాజు డిమాండ్ చేశారు. శనివారం నగరి పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో ప్రభుత్వ పాఠశాలల మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ అధ్యక్షురాలు జయలక్ష్మి ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో వారు పాల్గొన్నారు. కార్యక్రమంలో ఏఐటీసీ పట్టణ కార్యదర్శి దాసరి చంద్ర, వర్కింగ్ ప్రెసిడెంట్ రమాదేవి, ఏఐటీసీ నాయకులు మనీ, లత, యూనియన్ నాయకులు రాజేశ్వరి, రాణి, సెల్వి, సుశీల, సుమ, మహాలక్ష్మి, ఢిల్లీ భాయ్, సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

పొద్దుతిరుగుడు వైపు.. రైతన్న చూపు

– వేసవిలో పొద్దుతిరుగుడు సాగు

పాలసముద్రం: నీటి వసతి ఉన్న రైతులు ఖరీఫ్, రబీలోనే కాకుండా వేసవిలోనూ పొద్దుతిరుగుడు సాగు చేసుకోవచ్చు. రబీలో వరి సాగు చేసుకోని రైతులు నీటి సదుపాయం ఉంటే పొద్దుతిరుగుడును సాగు చేస్తే 70 నుంచి 90 రోజులలో దిగుబడి సాధించవచ్చు. నల్ల, ఎర్ర నేలలు, ఎర్ర మట్టి భూములు ఈ పంట సాగుకు అనుకూలమైనవి. చౌడు నేలలు అంతగా దిగుబడినివ్వవు. ఇంకా వేసవిలో పొద్దుతిరుగుడు సాగుకు రైతులు చేసుకుంటే మంచి దిగుబడి సాధించవచ్చు. మండలంలోని బాలక్రిష్ణాపురం, అలిమేలుంగాపురం, అలివులగుంట తదితర గ్రామాల్లో సన్‌ఫ్లవర్ సాగు చేస్తున్నారు. పొద్దుతిరుగుడు సాగు విధానం, ఇతర వివరాలను మండల ఇన్‌చార్జి వ్యవసాయాధికారి వేణుగోపాల్ రావు తెలిపారు.

విత్తన రకాలు

పొద్దు తిరుగుడు సాగుకు మోర్డన్, సీవో-2 వంటి స్వల్పకాలిక నూటి రకాలు, ఏపీఎస్‌హెచ్ 11, కేబీఎస్ హెచ్-1, ఏహెచ్-3425 వంటి మధ్యకాలిక సంకర జాతి రకాలతో పాటు ఎంఎస్‌ఎఫ్-8.17 పీఏసీ-36, 1091, సన్‌బ్రెడ్-279, సన్‌జీవ్-85, సన్‌రైజ్-1,2 తదితర ప్రైవేటు రకాలు అనువుగా ఉంటాయి. విత్తనాలను అధీకృత సంస్థల నుంచి మాత్రమే కొనుగోలు చేయాలి. హైబ్రీడ్ రకాల నుంచి తీసుకున్న ఎఫ్-2 విత్తనాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపయోగించకూడదు. పొద్దుతిరుగుడు ఆరుతడి పంటగా విత్తేటప్పుడు ముందుగా విత్తనాన్ని 24 గంటల పాటు నీటిలో లేదా 0.5 కాల్షియం క్లోరైడ్ ద్రావణంలో నానబెడితే మొక్క బాగా నిలదొక్కుకుంటుంది. విత్తనం ద్వారా వ్యాప్తి చెందే శిలీంధ్ర తెగుళ్ల నివారణకు కిలో విత్తనాలకు 3 గ్రాముల థైరమ్ లేదా మాంకోజెబ్ లేదా కాప్టాన్ లేదా కార్బండజిమ్, 5 గ్రాములు ఇమిడాక్లోప్రిడ్ పట్టించి శుద్ధి చేసుకోవాలి.


బాలక్రిష్ణాపురం సమీపంలో పొద్దుతిరుగుడు పంట

విత్తే విధానం

ఎకరానికి సంకరజాతి రకాలైతే 20-24 కిలోలు, నూటి రాలైతే 24-32 కిలోల విత్తనాలు అవసరమవుతాయి. తేలిక భూముల్లో వరుసల మధ్య 45 సెంటీ మీటర్లు, 20 సెంటీమీటర్లు మొక్కల మధ్య దూరాన్ని పాటిస్తూ గొర్రుతో విత్తనాలు వేసుకోవాలి. మధ్య రకం నేలల్లో ఈ దూరం 40-25 సెంటీమీటర్లుగా ఉండాలి. బరువు నేలల్లో 60-30 సెంటీమీటర్లుగా ఉండాలి. కుదురుకు ఒక్క బలమైన మొక్క ఉంటే చాలు. ఎక్కువగా ఉన్న మొక్కల్ని మొలిచిన 15 రోజుల్లోపు తీసివేయాలి. ఏటవాలు భూముల్లో పొద్దుతిరుగుడు వేస్తే వారు కాంటూరు సేద్యం చేసుకోవాలి. మురుగునీరు బయటికి పోయే సౌకర్యాన్ని కల్పించాలి.

యాజమాన్య పద్ధతులు

ఆఖరి దుక్కిలో ఎకరానికి 5-6 టన్నుల పశువుల ఎరువు వేసి బాగా కలియదున్నాలి. విత్తేటప్పుడు 30 కిలోల నత్రజని, 90 కిలోల భాస్వరం, 30 కిలోల పొటాష్ ఇచ్చే ఎరువులు వేయాలి. విత్తిన తర్వాత 35-55 రోజులకు 50కిలోల చొప్పున నత్రజనిని అందించే ఎరువు వేసుకోవాలి. పంట మొగ్గ తొడిగే సమయంలో, పువ్వు విప్పేటప్పుడు, గింజ కట్టేటప్పుడు నీడి ఎద్దడి లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అదే సమయంలో పంటకు నీరు ఎక్కువ కాకుండా చూసుకోవాలి. నీరు ఎక్కువైతే పాడలు, ఆకుమచ్చ తెగుళ్లు సోకుతాయి. గింజ కట్టే సమయంలో బెట్ట పరిస్థితులు ఏర్పడితే దిగుబడి తగ్గుతుంది.